సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 26 । జూన్ । 2025



‘ఎస్’ వెనుక ఎవరు?

నూజివీడు నియోజకవర్గంలోని మద్యం బెల్టుషాపులకు మద్యం సిండికేట్ సరఫరా చేస్తున్న మద్యం సీసాలపై ‘ఎస్’ స్టిక్కర్ ఉండటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. 8లో



ఇంకా వెలగని ‘దీపం’

అట్టహాసంగా ప్రారంభించిన దీపం పథకం ఫలితం నీరుగారుతోంది. సుమారు రెండు నెలలైనా దీపం-2 రెండో విడత నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. 8లో



జయహో జగన్నాథా

జగన్నాథ రథోత్సవాలను శ్రీవారి క్షేత్ర దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని జగన్నాథుని ఆలయంలో ఈనెల 27 నుంచి నిర్వహించేందుకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. 8లో

కలల వారధి కల్లేనా?

- వశిష్ట గోదావరి వంతెనకు మళ్లీ అడ్డంకులు
- వంతెన టెండర్లు రద్దు చేసిన జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ
- వంతెనకు టెండర్లు పిలిచిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- రూ 591.71 కోట్లతో వంతెన నిర్మాణానికి చర్యలు
- రూ.60 కోట్లతో స్థల సేకరణ పూర్తి
- కూటమి నేతల కుట్రలతో వంతెన పనులకు బ్రేక్



నరసాపురం వశిష్ట రేవులో పంటుపై నదిని దాటుతున్న ప్రయాణికులు (ఫైల్)

నరసాపురం: వశిష్ట గోదావరిపై నరసాపురంలో నిర్మించాలనుకున్న వంతెన నిర్మాణం సందిగ్ధంలో పడింది. జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ రూ 591.71 కోట్ల నిధులతో వంతెన నిర్మించడానికి గత వైస్సార్‌సీపీ హయాంలో టెండర్లు పిలిచారు. ఎన్నికలు రావడం, కోర్టు అడ్డంకులతో కూటమి నేతల కుట్రలతో పనులు ముందుకు సాగలేదు. ఈ నెల 11న టెండర్లు తెరవాల్సి ఉండగా, సాంకేతిక కారణాలతో టెండర్లు రద్దు చేస్తున్నట్టు ఢిల్లీలోని జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ కేంద్ర కార్యాలయం పేర్కొంది. ఇప్పటికే టెండర్లు తెరిచే ప్రక్రియను రికార్డు స్థాయిలో 13 సార్లు వాయిదావేసి, చివరిగా టెండర్లు రద్దు చేయడం మరో విశేషం. వంతెన నిర్మాణం జరగకుండా అడ్డుకునే క్రమంలో కూటమి నేతలు కోర్టుల ద్వారా చేస్తున్న కుట్రలు కొనసాగుతున్నాయి. సుప్రీంకోర్టులో కేసు విచారణ ఆగస్టుకు వాయిదా పడింది. దీంతో వశిష్ట వంతెన కల నెరవేరే అవకాశాలు ఇప్పట్లో లేనట్టే.

ఉభయ గోదావరి జిల్లాలను కలుపుతూ వశిష్ట గోదావరిపై నరసాపురంలో వంతెన నిర్మించాలనేది దశాబ్దాల డిమాండ్. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా వంతెన నిర్మాణం ప్రారంభమవుతుందన్న తరుణంలో ఆయన అకాల మృతితో ఆ ప్రయత్నం ఆగిపోయింది. మళ్లీ ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వంతెన నిర్మాణంపై దృష్టిపెట్టి పనిచేయడం, అప్పటి ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు చొరవతో వంతెన నిర్మాణం ముందుకు కదిలింది. రూ 591.71 కోట్ల అంచనాతో నరసాపురం మండలం రాజుల్లంక వద్ద వంతెన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూనుకుంది. కోనసీమ జిల్లా చించినాడ మీదుగా నరసాపురం నుంచి ఒంగోలు వరకూ నిర్మించిన 216 జాతీయ రహదారికి బైపాస్ నిర్మించడం ద్వారా వంతెన నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. కోనసీమ జిల్లా శివకోడు నుంచి టేకిశెట్టిపాలెం మీదుగా ఉన్న స్టేట్‌హైవేను జాతీయ రహదారిగా మార్చి రామేశ్వరం మీదుగా ఇటు పశ్చిమ గోదావరి జిల్లాలోని రాజుల్లంక, వైఎస్ పాలెం, సీతారామపురం మీదుగా జాతీయ రహదారికి బైపాస్ హైవే రోడ్డు నిర్మించాలని ప్రతిపాదనలు తయారు చేసి టెండర్లు పిలిచారు. మధ్యలో కోనసీమ జిల్లా రామేశ్వరం, నరసాపురం మండలం రాజుల్లంక వద్ద వశిష్ట గోదావరిపై వంతెన నిర్మించడం ద్వారా వంతెన కలను నిజం చేయడానికి జగన్ ప్రభుత్వం పూనుకుంది. మొత్తం 380 మీటర్ల మేర వంతెన నిర్మాణానికి అంచనాలు తయారు చేశారు. స్థల సేకరణకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన రూ.60 కోట్లు మంజూరు చేసింది. స్థల సేకరణ సొమ్ముతో కలసి మొత్తం రూ 651.71 కోట్లు వంతెన నిర్మాణానికి ఖర్చుచేయడానికి జగన్ సర్కార్ పూనుకుంది.

మొదటి నుంచీ కూటమి నేతల కుట్రలు

అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మంచి పేరు ఎక్కడ వస్తుందోనని కూటమి నేతలు కొందరు కుట్రలు మొదలుపెట్టారు. కావాలని అడ్డంకులు సృష్టించడానికి స్థల సేకరణ అంశంలో కోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చారు. అప్పటి ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు గట్టి ప్రయత్నం చేసి స్టేను వెకేట్ చేయించారు. కూటమి కుట్రలు కొనసాగడంతో.. వివాదం సుప్రీంకోర్టు వరకూ వెళ్లింది. అక్కడ కేసు క్లియర్ అయిన తరువాత గానీ మళ్లీ రీటెండర్లు పిలిచే అవకాశం లేదని జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ వివరణ ఇచ్చింది.

ఇప్పటికే పనులు మొదలవ్వాలి



వశిష్ట వంతెన గోదావరి జిల్లాల ప్రజల చిరకాల కోరిక. మా హయాంలో స్థల సేకరరణ కూడా పూర్తయ్యింది. భూమి తీసుకున్న రైతులకు చెల్లింపులు జరిగిపోయాయి. అప్పుడు వెంతెన నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించడంలో వైస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మా ప్రభుత్వ హయాంలో టెండర్లు పిలిచాం. ఇప్పుడు టెండర్లు తెరిచి వంతెన పనులు మొదలు పెట్టడంలో ఈ ప్రభుత్వానికి ఇబ్బంది ఏంటో అర్థం కావడంలేదు.

– ముదునూరి ప్రసాదరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

న్యూస్‌రీల్

అధినేతతో భేటీ



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో కొట్టు సత్యనారాయణ

సాక్షి, భీమవరం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మాజీ మంత్రి, తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్ కొట్టు సత్యనారాయణ బుధవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో అధికార కూటమి సాగిస్తున్న అరాచకాలపై అధినేతతో చర్చించారు. ప్రజలకు అండగా ఉండాలని జగన్ సూచించినట్లు కొట్టు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల్లో నియామకాలు



బదుగు బాలాజీ



పడాల కిషోర్ రెడ్డి

ఆకివీడు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విభాగం అనుబంధ సంస్థ ఆర్‌టీఐ విభాగం కార్యదర్శిగా ఉండికి చెందిన బదుగు బాలాజీ, పార్టీ ఐటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పడాల కిషోర్ రెడ్డిని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీని మరింత పటిష్టం చేయడానికి కృషి చేస్తామని చెప్పారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ర్యాలీ



ర్యాలీ చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

భీమవరం(ప్రకాశం చౌక్): మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెలో భాగంగా 3 రోజు బుధవారం మున్సిపల్ ఆఫీస్ నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. వారి సమస్యలపై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల అలంకరించి వినతిపత్రం అందజేశారు. అనంతరం ర్యాలీగా తిరిగి వెళ్లి మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె కొనసాగించారు. కార్యక్రమంలో భీమవరం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశానికి హాజరు



విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రులు కారుమూరి, కొట్టు



జిల్లా అధ్యక్షుడు ముదునూరి, భీమవరం సమన్వయకర్త వెంకట్రాయుడు



పాలకొల్లు సమన్వయకర్త గుడాల గోపి

తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పలువురు నేతలు హాజరయ్యారు. మాజీ మంత్రులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ, పార్టీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, సమన్వయ కర్తలు గుడాల గోపి (పాలకొల్లు), చినమిల్లి వెంకట్రాయుడు (భీమవరం) పాల్గొన్నారు.

– సాక్షి గుంటూరు

దివ్యాంగులకు జాబ్ మేళా



జాబ్ మేళాలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వికలాంగ యువతకు నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఎంపికైన వారు ఉద్యోగాలలో స్థిరపడి మంచిగా జీవనం కొనసాగించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం ఆర్ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) నేషనల్ కెరియర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) ఆధ్వర్యంలో బుధవారం దివ్యాంగులకు నిర్వహించిన మెగా ఉద్యోగ మేళా కార్యక్రమానికి కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ మేళాలో 14 కంపెనీలు పాల్గొని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. మేళాకు 65 మంది హాజరు కాగా.. 45 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి డాక్టర్ పి.లోకమాన్ వివరించారు.

డీఎస్సీ పరీక్షకు 81.89 శాతం హాజరు

భీమవరం: జిల్లాలోని అయిదు పరీక్షా కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన డీఎస్సీ పరీక్షకు 81.89 శాతం అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ చెప్పారు. సెషన్ 1లో 580 మందికి 495 మంది హాజరుకాగా, సెషన్–2లో 276 మందికి 206 మంది హాజరయ్యారని ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని నారాయణ తెలిపారు.

భారతీయ ఉత్పత్తులకు మంచి గుర్తింపు



ఢాకాలో అంతర్జాతీయ టెక్స్‌టైల్స్ ఎగ్జిబిషన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్ : భారతీయ ఉత్పత్తుల నాణ్యతా ప్రమాణాలు పెరుగుతున్నాయని, ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు లభిస్తోందని శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ అన్నారు. బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో జరుగుతున్న అంతర్జాతీయ టెక్స్‌టైల్స్ ఎగ్జిబిషన్‌లో ఇండియన్ స్టాల్స్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. టెక్స్‌టైల్స్ అభివృద్ధి కోసం ఇండియా అనేక చర్యలు తీసుకుంటోందని, బంగ్లాదేశ్ ఇండియా పరస్పర సహకారం ఈ రంగాన్ని బలోపేతం చేస్తుందని, దానికి ఇరుదేశాల మధ్య సహకార సంబంధాలు బలోపేతం కావాలని అన్నారు.

పేదరిక నిర్మూలన కోసం చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్) : స్వయం సహాయక సంఘాల సభ్యులు నూతన ఆలోచనలు చేసి కొత్త ఉత్పత్తులతో మార్కెట్లోకి ప్రవేశించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ ఎంట్రపెన్యూర్ యాక్షన్ ప్లాన్ అమలుపై మెప్మా అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలలో పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం అనేక స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తుందని దీన్ని సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యానికి అనువైన యూనిట్లను స్థాపించి ఆర్థికంగా పురోగతి సాధించాలన్నారు. టీబీ ముక్త భారత్ అభియాన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా సెంట్రల్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా టీబీ డివిజన్ హెల్త్ అడిషనల్ సెక్రటరీ జిల్లా కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ నాగరాణి, డీఎంహెచ్ఓ జి.గీతాబాయి పాల్గొన్నారు.

పెన్షన్ నిబంధనల సవరణ సరికాదు

భీమవరం : పెన్షన్ నిబంధనల సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గాతల జేమ్స్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాగిరాజు సత్యనారాయణ రాజు కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లకు బుధవారం వినతిపత్రం అందించారు. పెన్షనర్లను గ్రూపులుగా విభజించే అధికారం కేంద్రం తన చేతుల్లోకి తీసుకుంటుందన్నారు. వేతన సవరణ సంఘం సిఫార్సులను పాత పెన్షనర్లకు వర్తింప చేయకుండా, కొత్తగా రిటైరయ్యే వారికి మాత్రమే వర్తింపజేసే అధికారం కలిగి ఉంటుందన్నారు.

క్లుప్తంగా

ఈవీఎం గోడౌన్ తనిఖీ



ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పీపీ రోడ్డులోని ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎం యంత్రాలను కలెక్టర్ చదలవాడ నాగరాణి బుధవారం తనిఖీ చేశారు. గోడౌన్‌కు వేసిన సీళ్లను ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్ క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపడం జరుగుతుందని తెలిపారు.

మా పాఠశాలను విలీనం చేయొద్దు సార్



కలెక్టరేట్‌లో డీఆర్వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: మా పాఠశాలను విలీనం చేయొద్దని దెయ్యాలతిప్పలోని ఎస్సీ పేటకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కలక్టరేట్‌లోని డీఆర్వో మొగలి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల కూటమి ప్రభుత్వం విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలలను విలీనం చేసే ప్రక్రియలో భాగంగా ఎస్సీ పేటలో ఉన్న పాఠశాలను బీసీ పేటలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో విలీనం చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధికారులకు మొర పెట్టుకున్నారు. గతంలో బీసీ పేటలోని వ్యక్తులకు తమ పేటలోని వ్యక్తులకు గొడవలు అయ్యాయని, ఇప్పుడు విలీనం చేయడం వల్ల మళ్లీ గొడవలు జరిగే ప్రమాదం ఉందని వినతి పత్రంలో ఎస్సీ పేట వాసులు తెలిపారు. సమస్యను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని డీఆర్వో హామీ ఇచ్చారు.

గ్యాస్ నొప్పితో మహిళ మృతి

చాట్రాయి: గ్యాస్ నొప్పితో ఓ మహిళ మృతి చెందింది. వివరాల ప్రకారం మండలంలోని పోతనపల్లి గ్రామానికి చెందిన వడిత్యా కామాక్షి (35) బుధవారం గ్యాస్ నొప్పిగా ఉందని భర్తతో కలిసి చాట్రాయి ఆర్ఎంపీ వైద్యులను ఆశ్రయించారు. టిఫిన్ చేసి రావాలని ఆర్ఎంపీ వైద్యుడు సూచించారు. అనంతరం టిఫిన్ చేసి వచ్చిన తరువాత బీపీ చూస్తుండగా ఆమె అకస్మాతుగా వాంతులు చేసుకుని అక్కడే స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు పీహెచ్‌సీ వైద్యురాలు విజయలక్ష్మి చెప్పారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆమె మృతితో భర్త, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. విజయలక్ష్మి భౌతికకాయాన్ని ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర మాజీ చైర్మన్ దేశిరెడ్డి రాఘవ రెడ్డి, వైఎస్సార్ సీపీ నేత కారంగుల వాసు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

ఇంకా వెలగని ‘దీపం’

- రెండు నెలలైనా అందని గ్యాస్ సబ్సిడీ
- రెండో విడత సుమారు రూ.19.81 కోట్ల బకాయిలు



దెందులూరు: ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన దీపం పథకం ఫలితం నీరుగారుతోంది. సుమారు రెండు నెలలైనా దీపం-2 రెండో విడత నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. తొలి విడతలో ఈ పథకం ద్వారా అరకొరగా నగదు విడుదల చేశారు. రెండో విడత పూర్తిగా విస్మరించారు. 2024 నవంబర్‌లో దీపం-2 పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం 2025 మార్చి 31 వరకు స్కీంను అమలు చేసింది. మొదటి విడత కొంతవరకు నగదును బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. రెండో విడత 2025 ఏప్రిల్ నుంచి ప్రారంభమైంది. రెండు నెలలు గడుస్తున్నా లబ్ధిదారుల ఖాతాల్లో పైసా కూడా జమ కాలేదు.

జిల్లాలో అన్ని గ్యాస్ కంపెనీలకు సంబంధించి 55 ఏజెన్సీలు ఉన్నాయి. వీటిలో సింగిల్, డబుల్ సిలిండర్ల కనెక్షన్లు కలిపి 6,92,825 ఉన్నాయి. మొదటి విడత జిల్లా వ్యాప్తంగా 4,40,278 మంది లబ్ధిదారులు గ్యాస్ బుక్ చేసుకున్నారు. 4,35,035 కనెక్షన్లకు మాత్రమే నగదు బ్యాంకు ఖాతాల్లో జమైంది. రూ.49,78,950 బకాయిలు బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై నెలాఖరుకు వరకు రెండో విడత గడువు నిర్ణయించారు. దీనికి సంబంధించిన నిధులు ఇంతవరకూ అందలేదు. రెండో విడతకు సంబంధించి రెండు నెలలుగా ఏప్రిల్, మే నెలల్లో జిల్లాలో సుమారుగా 1,77,040 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. వారు ఇప్పటికే గ్యాస్ ఏజెన్సీలకు డబ్బులు చెల్లించారు.

ఫిర్యాదులు బుట్టదాఖలు

దీపం పథకం సిలిండర్ నగదు అందలేదని చాలా మంది లబ్ధిదారులు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. అయితే వారి నగదుకి సంబంధించిన సమాచారం లేకపోవడం, గ్యాస్ కంపెనీలు తమ వద్ద ప్రభుత్వ నగదు లేదని స్పష్టం చేయడంతో ఫిర్యాదులను బుట్టదాఖలు చేస్తున్నారు.

ఏం సమాధానం చెబుతారు



మహిళలందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ పెద్దలు ఏం సమాధానం చెబుతారు. ఎన్నికల ముందు నాది హామీ అంటూ అన్ని ప్రచార సభల్లో హామీలిచ్చారు. ఇప్పుడు వంట గ్యాస్ విషయంలో కూడా మోసం చేస్తే ఎలా?

– నిట్టా లీలా నవకాంతం, జెడ్పీటీసీ దెందులూరు

సూపర్ సిక్స్ అమలు చేస్తారా?



కూటమి ప్రభుత్వానికి సూపర్ సిక్స్ హామీలు అమలు చేసే ఉద్దేశం ఉందా లేదా? అన్ని వర్గాల ప్రజలు సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తారని ఎదురుచూస్తున్నారు. సంవత్సరం పూర్తయింది. గ్యాస్ కాకుండా ఉచిత బస్సు.. ఆడబిడ్డ నిధి ఎప్పుడు అమలు చేస్తారు.

– అప్పన పద్మావతి, వైస్ ఎంపీపీ, పెదపాడు

ప్రజల్లో తీవ్ర అసంతృప్తి



ఎన్నికల ముందు అన్ని ప్రచార సభల్లో సూపర్ సిక్స్ పేరిట హామీలిచ్చారు. సంవత్సరం గడిచినా సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం లేదు. ఉచిత గ్యాస్, ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి మహిళలకు ఎంతో ఉపయోగపడే పథకాలు. అమలు చేయనప్పుడు హామీలు ఎందుకు ఇచ్చారు?

– పర్వతనేని శ్రావణి, సర్పంచ్, రామారావుగూడెం

సబ్సిడీ జమ చేస్తున్నాం



3.30 లక్షల మంది లబ్ధిదారులు గ్యాస్ సబ్సిడీ కోసం ఆన్‌లైన్ చేశారు. సబ్సిడీ జమ కార్యక్రమం జరుగుతుంది. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. లబ్ధిదారుల ఖాతాల్లో సబ్సిడీ సొమ్ము త్వరలోనే జమ అవుతుంది.

– విలియమ్స్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, ఏలూరు

9 కిలోల గంజాయి పట్టివేత

నలుగురు గంజాయి విక్రేతల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు

ఏలూరు టౌన్: గంజాయి విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేసి నిందితుల నుంచి 9 కిలోల గంజాయి, రెండు మోటారు సైకిళ్లు, రూ.4,100 నగదు, 4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం రాత్రి సీఐ వి.కోటేశ్వరరావు వివరాలు వెల్లడించారు. పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామ పరిధిలోని ఏలూరు జాతీయ రహదారి-16 సర్వీస్ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్నారని తెలియటంతో ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో త్రీటౌన్ ఎస్సై రాంబాబు, సిబ్బంది చాకచక్యంగా దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని మధ్యవర్తుల సమక్షంలో అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వీరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్-1985 మేరకు కేసు నమోదు చేశామన్నారు. విలాసాలు, సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో నిందితులు గంజాయి విక్రయిస్తున్నారని ఆయన తెలిపారు. నిందితులు బాపట్ల జిల్లా అద్దంకి మండలం ప్రాంతానికి చెందిన సైద వేణు, ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం పాదర్తికి చెందిన సింబత్తుల సాయి, అదే గ్రామానికి చెందిన అలుగుల నాగవర్ధన్‌గా గుర్తించామని, వీరితోపాటు ఒక మైనర్ బాలుడు కూడా ఉన్నట్లు సీఐ చెప్పారు.

జయహో జగన్నాథా



ఆలయం ముందు నిర్మించిన చలువ పందిరి



ముస్తాబైన సుభద్ర, బలభద్ర, జగన్నాథుల దారు విగ్రహాలు

రేపటి నుంచి లక్ష్మీపురం ఆలయంలో జగన్నాథ రథోత్సవాలు

ద్వారకాతిరుమల: పూరి క్షేత్రంలో వలే జగన్నాథ రథోత్సవాలను శ్రీవారి క్షేత్ర దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని జగన్నాథుని ఆలయంలో ఈనెల 27 నుంచి వచ్చేనెల 6 వరకు వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఉత్సవాల్లో భాగంగా జగన్నాథ స్వామివారు ఆలయ యాగశాలలో రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. దీన్ని పురస్కరించుకుని యాగశాల ప్రాంతాన్ని ముస్తాబు చేస్తున్నారు. అలాగే స్వామివారి రథయాత్రలకు వినియోగించే రథ వాహనాన్ని సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఆలయం ముందు చలువ పందిరిని నిర్మించారు. అదేవిధంగా ఆలయాన్ని, పరిసరాలను విద్యుద్దీప తోరణాలతో అలంకరించారు. ఉత్సవాల ప్రారంభం రోజు శుక్రవారం సాయంత్రం సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు రథ వాహనంలో కొలువుదీరి ద్వారకాతిరుమల క్షేత్రానికి వెళ్లనున్నారు. అలాగే వచ్చేనెల 6 న ఆలయం నుంచి సమీప గ్రామమైన తిమ్మాపురం వైపు రథయాత్ర సాగనుంది.



జగన్నాథుని రథం

ఉత్సవాలు జరిగే పదిరోజులు జగన్నాథుని దశావతారాలు భక్తులను అలరించనున్నాయి. ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తరించాలని ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి కోరారు. ఉత్సవాల్లో భాగంగా రోజుకో ప్రత్యేక అలంకారంలో స్వామివారు దర్శనమివ్వనున్నారు.

ఆలయ విశిష్టత

ఈ ఆలయాన్ని ఒరిస్సా రాష్ట్రానికి చెందిన పూరీ వాస్తవ్యులు, మఠాధిపతులైన మంత్రరత్నం అమ్మాజీ అనే లక్ష్మీ అమ్మవారు 130 ఏళ్ల క్రితం నిర్మించారు. అందులో జగన్నాథునితో పాటు, వేంకటేశ్వర స్వామివారిని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి కల్యాణోత్సవ, పవిత్రోత్సవాలతో కైంకర్యాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శ్రీవారి దేవస్థానం ఈ ఆలయాన్ని దత్తత తీసుకున్న తరువాత జీర్ణోద్ధరణ గావించి మరింత అభివృద్ధి చేసింది. ఈ ఆలయంలో వేంకటేశ్వర స్వామి, అమ్మవార్లతో పాటు జగన్నాథ స్వామి, బలరామస్వామి, సుభద్రాదేవుల సన్నిధి, ఆళ్వారుల సన్నిధి, శ్రీ సంతాన వేణుగోపాల స్వామి సన్నిధి ఉన్నాయి.

‘ఎస్’ వెనుక ఎవరు?

మద్యం సీసాలపై ‘ఎస్’ స్టిక్కర్‌పై సర్వత్రా చర్చ



‘ఎస్’ స్టిక్కర్ అంటించిన మద్యం సీసాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: నూజివీడు నియోజకవర్గంలోని మద్యం బెల్టుషాపులకు మద్యం సిండికేట్ సరఫరా చేస్తున్న మద్యం సీసాలపై ‘ఎస్’ స్టిక్కర్ ఉండటంతో నియోజకవర్గ వ్యాప్తంగా సర్వత్రా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఊరూరా పదుల సంఖ్యలో బెల్టుషాపులు, మద్యం దుకాణాల వద్ద బార్‌లను తలపించేలా అనధికార సిట్టింగ్‌లతో మద్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా సాగుతోంది. ఇష్టారాజ్యంగా సిట్టింగ్‌లతో మద్యం వ్యాపారం జోరుగా సాగుతున్నప్పటికీ అనధికార సిట్టింగ్‌ల వైపు ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం సిండికేట్ బెల్టుషాపులకు ‘ఎస్’ స్టిక్కర్‌తో మద్యం సీసాలను సరఫరా చేస్తుండటం తీవ్ర సంచలనంగా మారింది. ఈ స్టిక్కర్ అర్థం ఏమిటి, దీని వెనుక ఉన్నదెవరనే ప్రశ్నలు రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. మద్యం షాపుల నుంచి బెల్టుషాపులకు మద్యం సీసాలు రవాణా అవుతుంటే స్టిక్కర్ వేయాల్సిన అవసరమేముందనే సందేహం ప్రతి ఒక్కరిలో వస్తోంది. అలా కాకుండా ఇంకేదైనా మద్యంను సరఫరా చేస్తున్నారా అనే అనుమానాలు ప్రబలడానికి ఆస్కారం ఏర్పడింది.

బెల్టుషాపుల్లో ఎమ్మార్పీ కంటే రూ.40 అధికం

ఏ గ్రామంలోనైనా బెల్టుషాపు పెట్టాలంటే రూ.25 వేలు చెల్లించాల్సిందే. బెల్టుషాపులకు అనుమతి లేదని, ఎమ్మార్పీ ధరలకే మద్యాన్ని విక్రయించాలని ప్రభుత్వం ప్రకటనలు ఇస్తుంటే ఇక్కడ మాత్రం ఒక్కో సీసాపై రూ.20 నుంచి రూ.40 అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మద్యం సిండికేట్ బెల్టుషాపులకు ఏ మద్యం బ్రాండ్ అయినా సరే ఒక్కో సీసాపై ఎమ్మార్పీపై అదనంగా రూ.20కు విక్రయిస్తుండగా బెల్టుషాపుల నిర్వాహకులు మరో రూ.20 వేసుకొని మందుబాబులకు అమ్ముతున్నారు. దీంతో ఒక్కో సీసాకు ఎమ్మార్పీ కంటే రూ.40 అదనంగా చెల్లించి మందుబాబులు మద్యంను సేవించాల్సి వస్తోంది. పెద్ద ఎత్తున అధిక ధరలకు విక్రయిస్తూ ఇంత దారుణంగా దోపిడీ చేస్తుంటే పట్టించుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అప్పుడప్పుడు దాడులు చేస్తూ బెల్టుషాపుల నిర్వహణకు అనుమతి లేదంటూ ప్రకటనలు ఇచ్చి మిన్నకుండిపోతున్నారు.

మావుళ్లమ్మకు ఉయ్యాల సేవ



అమ్మవారికి ఉయ్యాల సేవ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం మావుళ్లమ్మ అమ్మవారి జ్యేష్ఠమాస జాతర మహోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు బుధవారం అమ్మవారికి ఉయ్యాల సేవ నిర్వహించారు. పుట్టింటి, అత్తింటి వారు అల్లూరి, మెంటే వంశస్తులచే ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ ఈ కార్యక్రమాన్ని జరిపారు. అలాగే అమావాస్య సందర్భంగా మావుళ్లమ్మ దేవస్థానంలో చండీహోమం నిర్వహించారు. ఈ హోమంలో 60 మంది దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

– భీమవరం (ప్రకాశం చౌక్)

బీజీబీఎస్ మహిళా కళాశాల వ్యవహారంపై విచారణ



నరసాపురంలో కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

నరసాపురం: పట్టణంలో పద్మశ్రీ అద్దేపల్లి సర్విశెట్టి స్థాపించిన బీజీబీఎస్ మహిళా కళాశాల పాలకవర్గంపై ఇటీవల వస్తున్న ఆరోపణలపై బుధవారం ఉన్నత విద్యామండలి ఆర్‌జేడీ (రాజమండ్రి) పీవీ కృష్ణారావుతో కూడిన అధికార బృందం కళాశాలలో విచారణ నిర్వహించింది. కళాశాల అధ్యక్షుడు, కార్యదర్శి, ట్రెజరర్ కలిపి కళాశాల ఆస్తులు ఇష్టానుసారం అమ్మేస్తున్నారని, కళాశాలలో అవకతవకలు జరుగుతున్నాయనే అంశాన్ని ఇటీవల ‘అమ్మకానికి మహాశయుడి ఆస్తులు’ శీర్షికన సాక్షి దినపత్రిక వెలుగులోకి తీసుకురావడంతో డొంక కదిలింది. కళాశాలలో పనిచేస్తున్న మహిళా అధ్యాపకురాలు ఒకరు బయటకు వచ్చి కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ తమను లైంగికంగా వేధిస్తున్నాడంటూ మీడియాకు వివరించడం చర్చనీయాంశమైంది. కళాశాల వ్యవహారాలపై చర్యలు తీసుకోవాలని కావలి నాని అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ చేపట్టారు.

లోపల విచారణ.. బయట ఆందోళన

కళాశాలలో అధికారులు విచారణ జరుపుతుండగా, బయట కాంట్రాక్ట్ అధ్యాపకులు, సిబ్బందితో కలసి బీసీ సంఘ నేత చింతపల్లి గురుప్రసాద్ నాయకత్వంలో ఆందోళన నిర్వహించారు. కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ కబంధహస్తాల నుంచి కళాశాలను కాపాడాలని, పాలకవర్గంపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో టౌన్ ఎస్సై ముత్యాలరావు సిబ్బందితో వచ్చి బందోబస్తు నిర్వహించారు. విచారణ అధికారి కృష్ణారావు విద్యార్థులు, అధ్యాపకులను విచారించి వివరాలు రికార్డు చేసుకున్నారు. ఈ వ్యవహారానికి కేంద్ర బిందువైన నూలి శ్రీనివాస్ విచారణకు హాజరుకాకపోవడం విశేషం. అనంతరం కృష్ణారావు విలేకరులతో మాట్లాడుతూ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఆందోళనలో బిళ్ల బ్రదర్స్, కోట్ల రామకృష్ణారావు, కోట్ల రాజా, స్వర్ణాంధ్ర త్రినాథ్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ 6 నెలల్లో any డిగ్రీ, PG, డిప్లొమా, B.tech, BAMS, BHMS, D. ఫార్మసీ, B. ఫార్మసీ, LLB, U.G.C యూనివర్శిటీస్ నుండి పూర్తిచేయండి. ✆ 99895 30727 [SCA25005386]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2636]

Wanted

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చంటిపిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్ జీ : 18K. Ph: 9640468899, 9640258899 [SCA25005265]

■ కేర్ టేకర్స్, నర్సులు కావలెను. VJAలో ప్రముఖ హోమ్‌కేర్ సర్వీసెస్‌లో ఇంటివద్దనే వుండి పెద్దవారిని చూసుకొనుటకు అనుభవంగల వర్కర్స్, మంచిజీతం ✆ 99121 15559, 91608 35559 [B-136]

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా,నర్సులు,వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు- 40 వేలు,ఫ్రీరూం+భోజనం.HYD.Ph:7995365999 [HA-15928]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 96032 03355, 92814 52843 [SCA25005423]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రికెట్ గురించి తాజా సమాచారానికి, రచనలకు www.sakshi.com

సాక్షి స్పోర్ట్స్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



సూరాబత్తుల సాయిబాబు మృతదేహం

భీమడోలు: సూరప్పగూడెంలోని పాత సుగర్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సూరాబత్తుల సాయిబాబు(30) పాత షుగర్స్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 24న ఫ్యాక్టరీలో మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల షిఫ్ట్‌లో పని చేసేందుకు వెళ్లాడు. రాత్రి 10 గంటలకు షిఫ్ట్ దిగాల్సి ఉండగా రిలీవర్‌కు అతను కనిపించలేదు. ఫ్యాక్టరీలో ఉన్న చెరువు పక్కన అతని దుస్తులు కనిపించడంతో చెర్వులో వెతకగా బుధవారం అతడి మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి చిరంజీవి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు. కాగా సాయిబాబుతో మనస్పర్థల కారణంగా అతడి భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన సాయిబాబు ఆత్మహత్యకు పాల్పడినట్లు చెబుతున్నారు.

మహిళ మృతదేహం లభ్యం

ఉంగుటూరు: చేబ్రోలు-బాదంపూడి రైల్వే స్టేషన్ల మధ్య బుధవారం గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించినట్లు తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై అప్పారావు తెలిపారు. మృతురాలి వయస్సు 30 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని, మృతురాలు కుడి చేతిపై తమ్ముడు అను పచ్చబొట్టు కలిగి ఉందని తెలిపారు. వివరాలు తెలిస్తే 94906 17090, 99480 10061 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఏలూరు శాయ్ ఇన్‌చార్జి అరెస్ట్

- లైంగిక వేధింపులపై పోక్సో కేసు నమోదు
- 14 రోజుల రిమాండ్ విధించిన న్యాయస్థానం

ఏలూరు టౌన్: లైంగిక వేధింపుల కేసులో ఏలూరు శాయ్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) ఇన్‌చార్జిని ఏలూరు టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం ఏలూరు శాయ్ ఆధ్వర్యంలోని స్పోర్ట్స్ ట్రెనింగ్ సెంటర్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న దూలం నాగేంద్ర వెంకట వినాయక ప్రసాద్ శిక్షణ పొందుతోన్న బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడుతన్నారంటూ బాలిక ఇచ్చిన ఫిర్యాదుతో టూటౌన్ ఎస్సై కళ్యాణి పోక్సో కేసు నమోదు చేశారు. ఏలూరు శాయ్‌లోని 10మంది బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన అభియోగంపై ఇప్పటికే బెంగుళూరు శాయ్ బృందం విచారణ చేపట్టగా.. ఏలూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఎస్పీ కేపీ శివకిషోర్ ఆదేశాలతో ఏలూరు డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏలూరు టూటౌన్ సీఐ కే.అశోక్‌కుమార్, మహిళా ఎస్సై కళ్యాణి గాలింపు చర్యలు చేపట్టి మంగళవారం రాత్రి వినాయక ప్రసాద్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడిని బుధవారం పోలీసులు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14రోజులు రిమాండ్ విధించారు.

క్లుప్తంగా

సర్పంచ్‌లకు ముగిసిన శిక్షణ



మండల పరిషత్ సమావేశ మందిరంలో మహిళా సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండల పరిషత్ సమావేశ మందిరంలో గత మూడు రోజులుగా మహిళా సర్పంచ్‌లకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ పంచాయతీ పరిపాలన, విధులు, బాధ్యతలు, నిధులు, వాటి వినియోగం తదితర అంశాలపై సర్పంచ్‌లకు అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న సర్పంచ్‌లకు సర్టిఫికెట్లు అందజేశారు. డిప్యూటీ ఎంపీడీవోలు ఎం.వెంకటేష్, సత్యనారాయణ, రిసోర్స్ కోఆర్డినేటర్ విశ్వనాథ్, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

పర్తి యాత్రకు తాడేపల్లిగూడెం సత్యసాయి సేవా సమితి సభ్యులు



పుట్టపర్తిలో సత్యసాయి సమితి సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీ సత్యసాయి బాబా శత జయంతి కార్యక్రమాలలో భాగంగా జిల్లా శ్రీ సత్యసాయి సేవా సంస్థలు ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంనకు చెందిన శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు పర్తియాత్ర ఇటీవల నిర్వహించారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయం సాయి కుల్వంత్ హాల్‌లో జరిగిన వివిధ కార్యాక్రమాలు అష్టోత్తర శత నామవళి, వేద పఠనం, నాటిక, నామ సంకీర్తనలలో పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు కె.రవీంద్రప్రసాద్, కన్వీనర్ ఎంఎస్ఎస్‌కే జనార్ధనరావు, జంధ్యాల నాగేశ్వరరావు, నవీన్ బాబా, తోలేటి శ్రీనివాస్, గ్రంధి సాయి సుబ్రహ్మణ్యం, అనిల్ కుమార్, విశ్రుద్, సూరజ్, రామకృష్ణ, తోట రాధికారాణి, పార్వతి, జంధ్యాల పద్మావతి, శ్రీ లక్ష్మి, గ్రంధి పమిడేశ్వరి, రమాదేవి, కొలచన లక్ష్మి, సౌందర్య, తులసి, అన్నపూర్ణ, పుష్పిత తదితరులు పాల్గొన్నారు.

17.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 17.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ఎం. సునీల్ కుమార్ బుధవారం తెలిపారు. వర్షాలకు ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఘనంగా మావుళ్లమ్మ జాతర



అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పెనుగొండ: సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్లమ్మ జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం ఉదయం నుంచి మావుళ్లమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం రాత్రి మావుళ్లమ్మ ఫ్రెండ్స్ యూనియన్, మావుళ్లమ్మ ఆలయ పునఃనిర్మాణ కమిటీ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో జోరు వర్షంలోనూ జాతరను బుధవారం ఉదయం వరకూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బుట్టబొమ్మల విన్యాసాలు ఆకట్టుకొన్నాయి. అమ్మవారి ఉగ్రరూప నృత్యం తిలకించడానికి పరిసర గ్రామాల నుంచి మహిళలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. పుర వీధుల్లో గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు. బాణసంచా కాల్పులు, మంగళ వాయిద్యాలతో ఉత్సవం వేడుకగా నిర్వహించారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

భీమవరం(ప్రకాశం చౌక్): పీజీఆర్ఎస్ వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మండల సర్వేలను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో పీజీఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులు పెండింగ్, జాయింట్ ఎల్ పి ఎం ఎస్ సంబంధించిన పురోగతిపై బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా సర్వే అధికారి, డివిజన్ మండల సర్వేలతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా శ్రద్ధ పెట్టి పనిచేయాలని సర్వే అధికారులను ఆదేశించారు.

అక్రమ మద్యం స్వాధీనం

ఆకివీడు: స్థానిక పాత బస్టాండ్ సమీపంలో అక్రమ మద్యం (ఎన్డిపిఎల్)విక్రయిస్తున్న వ్యక్తిని బుధవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు చెప్పారు. స్థానికంగా నివసిస్తున్న సత్యనారాయణ అనే వ్యక్తి వద్ద 13 అక్రమ మద్యం బాటిల్ (750ఎంఎల్) స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పిల్లకాలువ గట్టు ఖాళీ చేయాల్సిందే

- పిల్లలతో ఎక్కడకు పోవాలంటున్న పేదలు
- 30 ఏళ్లుగా ఏ సమస్యలేదు, ఇప్పుడేమైందంటూ రోదనలు
- నిరాశ్రయులైపోతామని కన్నీళ్లుపెట్టుకుంటున్న పేదలు
- చంటి బిడ్డలతో ఏడకు పోవాలంటున్న బాలింతలు



తణుకు పిల్ల కాలువ గట్టు వద్ద మేమెక్కడికి పోవాలని ఆందోళన వ్యక్తం చేస్తున్న పేదవర్గాలు



తణుకు పిల్లకాలువ గట్టు వద్ద ఆశ్రయం కోల్పోయి పిల్లలతో రోడ్డునపడ్డ కుటుంబం



తణుకు పిల్లకాలువ గట్టును ఆనుకుని గుడిసెలు వేసుకున్న పేదవర్గాలు

తణుకు అర్బన్ : 30 ఏళ్లుగా కాలువ గట్టుపైనే గుడిసెలు వేసుకుని ఆశ్రయం పొందుతున్నాం.. చిన్న పిల్లలతో ఉంటూ కూలి పనులు చేసుకుని కాలం గడుపుతున్నాం.. ఇప్పుడు అర్థంతరంగా పొమ్మంటే ఎక్కడకు పోతామని తణుకు పాతవూరులోని 6వ వార్డు పిల్లకాలువ గట్టు ప్రాంత నివాసితులు కన్నీళ్ల పర్యంతమవుతున్నారు. కాలువ పనుల్లో భాగంగా గుడిసెలు తీసేయమని అధికారులు చెప్పినవెంటనే తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దగ్గరకు వెళ్లి మొరపెట్టుకున్నాం. మీకు ఏమి ఇబ్బంది లేకుండా చూస్తానని చెప్పారు. కానీ నేడు మరల కొంతమంది వచ్చి ఈ రోజు గుడిసెలన్నీ తీసేయాలని గొడవ చేశారని లేదంటే మిషన్‌లు తీసుకువచ్చి కూలగొట్టేస్తామని భయపెడుతున్నారని వాపోయారు. ఇప్పటికిప్పుడు వెళ్లిపొమ్మంటే ఎక్కడకు పోతామని మాకేమైనా దారి చూపించి వెళ్లమంటే పోతాం కానీ చిన్న పిల్లలతో ఎక్కడ వెళ్లాలని నిలదీస్తున్నారు. వర్షం వస్తున్నా సరే పోవాల్సిందేనని అనడం ఎంతవరకు సబబని ప్రశ్నిస్తున్నారు. కాలువ గట్టుపై 12 గుడిసెల్లో మొత్తం 40 మంది వరకు నివాసముంటున్నామని బాధితులు చెబుతున్నారు.

30 ఏళ్లుగా లేని సమస్య ఇప్పుడెందుకు..

గత 30 ఏళ్లుగా ఇక్కడే గుడిసెల్లో నివసిస్తున్నామని ఎప్పుడూ కూడా ఇటువంటి సమస్య రాలేదని కానీ నేడు ఎందుకు ఇలా వేధిస్తున్నారని పేదవర్గాలు రోదిస్తున్నారు. ఇక్కడ అన్ని రకాల కులాలకు చెందిన వారు ఉన్నామని, యానాదులు, ఉప్పర, మాల, మాదిగ జాతుల వారందరూ ఉన్నామని చెబుతున్నారు. నిత్యం కూలిపనులతో పాటు చేపలు పట్టుకుని అమ్ముకుని జీవించే వారమని మేము ఎక్కడకు పోగలమని మండిపడుతున్నారు. వర్షం పడుతుందన్న జాలి కూడా లేకుండా పోవాల్సిందేనని ముక్కుసూటిగా చెబుతున్నారని మాకు ఏదైనా ఆధారం చూపిస్తే తప్ప మేము కదలివెళ్లలేమని చెబుతున్నారు. కాలువ తవ్వకానికి అడ్డొచ్చిన గుడిసెలు మేమే తొలగించి మిషన్ రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూశామని తీరా పని పూర్తయ్యాక మీరు గుడిసెలు తీస్తారా మమ్మల్ని పీకెయ్యమంటారా అని భయపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో లేని సమస్య మాకు ఇప్పుడు ఎందుకు వచ్చిందో అర్థం కావడంలేదని నిలదీస్తున్నారు. రాజకీయంగానే మమ్మల్ని ఇబ్బందులు పెడుతున్నారని అనుమానంగా ఉందని వాపోతున్నారు. పీడబ్ల్యూడి ఏఈ బాలమురళిని సాక్షి వివరణ కోరగా కెనాల్‌ను అభివృద్ధి పనుల్లో భాగంగా ఉండ్రాజవరం కెనాల్ నుంచి పనులు ప్రారంభించామని తణుకు పిల్లకాలువ గట్టు కూడా తవ్వకాలు జరిపామని చెప్పారు. కాలువ గట్టుపై ఉన్న గుడిసెలను తాము తొలగించ మనలేదని, పనులు నిర్వహిస్తున్న రైతు సంఘ నాయకులు తొలగించాల్సిందిగా ఆదేశించి ఉంటారని వివరించారు.

గుడిసె తొలగించి దారిచ్చాను



గత 25ఏళ్లుగా భార్య, ముగ్గురు ఆడపిల్లలతో పిల్ల కాలువ గట్టుపై గుడిసె వేసుకుని నివసిస్తున్నాను. ఉంటే తింటున్నాం లేకపోతే కాళ్లు తన్నిపెట్టుకుని గుడిసెలో పడిఉంటున్నాం. కాలువ తవ్వకానికి గుడిసె అడ్డం వస్తుందంటే తొలగించి దారిచ్చాను. ఇప్పుడు మళ్లీ వేసుకుందామంటే ఉన్నవే తొలగించాలని బెదిరిస్తున్నారు. గతంలో ఎప్పుడూ మాకు ఈ సమస్య రాలేదు.

– గాలింకి సత్యనారాయణ, బాధితుడు

10 మంది ఒక్క గుడిసెలో ఉంటున్నాం



గత 30 ఏళ్లుగా నా పిల్లలు, మనుమలు 10 మంది కాలువ గట్టుపై చిన్న గుడిసెలో కాలం గడుపుతున్నాం. కాలువ తవ్వకం పనులే కథా అనుకున్నాం పరవాలేదని అందరం దారిచ్చి మరీ తవ్వకానికి సహకరించాం. కానీ ఇప్పుడు హఠాత్తుగా గుడిసెలు తొలగించాలని చెబుతుంటే భయం వేస్తుంది. పిల్లలను భుజాన్నేసుకుని ఏ చెట్టు కింద గడపాలో తెలియడంలేదు. మాకు ఏదైనా దారి చూపించనిదే మేము ఎక్కడకు వెళ్లలేము.

– దాసిపత్రి ముత్యాలమ్మ, బాధితురాలు

పిల్లలతో రోడ్డున పడమంటారా..



నా కొడుకు చనిపోగా కోడలు, పిల్లలతో కాలువగట్టుపై గుడిసెవేసుకుని 25ఏళ్లుగా బతుకుతున్నాం. 5 ఏళ్ల క్రితం నుంచి కరెంటు బిల్లు కూడా కడుతున్నాం. ఇప్పుడు అర్థంతరంగా పొమ్మంటే ఎక్కడకు పోవాలి. వర్షం వస్తుందన్న కనికరం కూడా లేకుండా ఈరోజే ఇళ్ల ఖాళీచేయాలని లేదంటే గుడిసెలు పడగొట్టేస్తామని హెచ్చరిస్తున్నారని వాపోయారు. ఇన్నేళ్లుగా మా జాగాకు ఏ ఇబ్బంది రాలేదు మరి ఇప్పుడేమైందో కానీ హఠాత్తుగా గుడిసెలు ఖాళీచేయాలంటున్నారు.

– గడిదాటి శశిరేఖ, బాధితురాలు

కూటమి నాయకులపై వైఎస్సార్ సీపీ ఫైర్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్ : కూటమి ప్రభుత్వంలో గ్రామాభివృద్ధిని విస్మరించి రెడ్‌బుక్ పాలన నడిపిస్తున్నారని తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు దుయ్యబట్టారు. బుధవారం మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ కార్యాలయంలో నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనలో రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎటుపోతున్నాయో తెలియని దుస్థితి నెలకొందన్నారు. మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ తాడేపల్లి గూడెం అభివృద్ధికి నాంధి పలికారన్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్ స్వరూపాన్ని మార్చారని చెప్పారు. తాడేపల్లిగూడెంలో కోడిపందేలు, పేకాట క్లబ్‌లు, దాబాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారని ఇటీవల ఒక సమావేశంలో మా నాయకుడు మాజీ మంత్రి కొట్టు ఆరోపించిన సమయంలో ఎక్కడున్నాయని చూపించగలరా అని అడగలేకపోయిన కూటమి నాయకులు వాస్తవాన్ని ఒప్పుకున్నట్లు ఉందన్నారు. తాడేపల్లిగూడెంలో జిల్లా కోర్టు ఏర్పాటుకు 20 ఏళ్ల నుంచి పోరాడుతున్నా అది కొట్టు సత్యనారాయణ హయాంలోనే సాధ్యమైందన్నారు. పదవిలోకి వచ్చి ప్రజల మన్ననలు పొందడం ముఖ్యమన్నారు. అభివృద్ధి పేరుతో కూటమి నాయకులు దందాలు చేస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధిపై చర్చకు రావాలని కూటమి నాయకులకు సవాలు విసిరారు. ఈ సమావేశంలో కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, కర్నాటి కన్నయ్య, బొద్దాని శ్రీనివాస్, గార్లపాటి వీరకుమార్, చామన సూర్య చంద్రరావు, షేక్ నౌషద్, పాల్గొన్నారు.

దారి గుంతలుగా మారి..



కంతేరు నుంచి పద్దిరెడ్డి పాలెం వెళ్లే రోడ్డు



కావలిపురం నుంచి అర్జునుడుపాలెం రోడ్డు

ఇరగవరం: మండలంలోని పలు రోడ్లు, అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కావలిపురం నుంచి అర్జునుడుపాలెం రోడ్డు, కంతేరు పద్ది రెడ్డి పాలెం రోడ్డు, కావలిపురం ఇరగవరం రోడ్డు పూర్తిగా పాడై పోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ రహదార్ల గుండా తరుచూ ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాకాలంలో ఈ మార్గంలో ప్రయాణం మరింత కష్టంగా ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన అధికారులు, నాయకులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. సాక్షి దీనిపై చక్రధర్ ఏఈని వివరణ కోరగా రోడ్లను పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

కౌలుదారులంతా సాగుదారు హక్కు పత్రాన్ని పొందాలి



తేతలిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో రాజేంద్రప్రసాద్

తణుకు అర్బన్: కౌలుదారులు తప్పనిసరిగా ఈ నెలాఖరులోపు పంట సాగుదారు హక్కు పత్రము (సీసీఆర్‌సీ) తీసుకోవాలని, గతంలో తీసుకున్న రైతులు రెన్యూవల్ చేయించుకోవాలని తణుకు మండల వ్యవసాయాధికారి కె.రాజేంద్ర ప్రసాద్ అన్నారు. తణుకు మండలం తేతలి గ్రామంలో తాళ్లచెరువు పుంతలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలోని సీసీఆర్‌సీ కార్డు పొందే విధానంతోపాటు కౌలు రైతులు సొంత రైతుల వద్ద నుంచి ఫామ్ 1లో అనుమతి పొందాలని సూచించారు. సొంత రైతులు అందుబాటులో లేని పక్షంలో మొబైల్ వాట్సప్ ద్వారా అనుమతి పొందవచ్చని తెలిపారు. ఈ విధంగా పూర్తి చేసిన ఫామ్ 1తోపాటు సొంత రైతు పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్ నెంబరు, మొబైల్ నంబరుతోపాటు కౌలు రైతు ఆధార్ జిరాక్స్ కాపీ, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, ఫోన్ నంబరును ఆ గ్రామంలోని వీఆర్వో, వీఏఏలకు అందచేయడం ద్వారా సీసీఆర్‌సీ కార్డును పొందవచ్చని వివరించారు. గ్రామ వీఏఏ యు.స్వప్న మీనాక్షి, ఏహెచ్ఏ రైతులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన కౌలు రైతులు

పెనుమంట్ర: ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలని ఏపీ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి నెలల తరబడి ధాన్యం డబ్బులు రాకపోవడంతో కౌలు రైతులకు పంట నుంచి వచ్చే ప్రతిఫలం కనీసం తెచ్చిన అప్పుల వడ్డీలకు కూడా సరిపోవడం లేదని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీ సమావేశం మార్టేరులోని రోటరీ క్లబ్‌లో కూసం పూడి సుబ్బరాజు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం ధాన్యం డబ్బులు ఇవ్వాలని పంచాయతీ సెంటర్ వద్ద కౌలు రైతులు, జిల్లా కమిటీ సభ్యులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ధాన్యం అమ్మి రెండు నెలల వుతున్నా రైతులకు డబ్బులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. జిల్లాలో దాదాపు మూడు వేల మంది కౌలు రైతులకు రూ.250 కోట్ల వరకు రావాలని తెలిపా రు. ప్రభుత్వం ధాన్యం డబ్బులు వెంటనే ఇవ్వకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామన్నారు. సమావే శంలో కౌలు రైతులకు భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులిచ్చి అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేశామన్నారు. కౌలు రైతుల సమ స్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కేతా గోపాలన్, కవురు శ్రీనివాస్, ఇంజేటి శేఖర్, కేతా పూర్ణారావు, కర్రి నాగిరెడ్డి, మన్నె నగేష్, ఉందుర్తి శ్రీను, గుత్తుల వెంకటేశ్వరరావు, కేతా పాటియ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళన ఉధృతం

తణుకు అర్బన్: మునిసిపల్ ఇంజనీరింగ్ అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని యూనియన్ అధ్యక్షుడు ఉండ్రాజవరపు శ్రీను, కార్యదర్శి గెల్లా విజయ్‌కుమార్ అన్నారు. సమాన పనికి సమానవేతనంగా గుర్తించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ అమలు చేయాలని, రద్దు చేయాల్సి వస్తే తమను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి విధుల్లో ఉంటూ సేవలందిస్తున్నా పెరిగిన ధరలకు కుటుంబాన్ని పోషించుకోలేకపోతున్నామని స్పష్టం చేశారు. కనీస వేతనాలు అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ అనంతరం రూ. 10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, డీఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డిలకు వినతిపత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో నవీన్, పుప్పాల అయ్యప్ప, సత్యనారాయణ, జవ్వాది గోపి, రాంబాబు, పిండి పెద్దిరాజు పాల్గొన్నారు.

అనుమానాలు రేకెత్తిస్తున్న మస్తర్లు

పెనుగొండ: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉపాధి కూలీలకు ములపర్రులో రాత్రి వేళ మస్తర్లు వేయడం అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. సాధారణంగా ఉపాధి కూలీలకు ఉదయం, సాయంత్రం మస్తర్లు వేస్తారు. అయితే దీనికి భిన్నంగా ములపర్రులో రాత్రి వేళ మస్తర్లు వేస్తున్నారు. దీనిలో మర్మం బోధ పడడం లేదంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. తప్పుడు మస్తర్లు వేస్తున్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెబాట

- ఆందోళన బాటలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు
- పూర్తి స్థాయి సమ్మెలోకి కార్మికులు
- సమ్మె ఒప్పందాల్ని అమలు చేయాలని డిమాండ్



మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఇంజనీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గత సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ మున్సిపల్ ఇంజనీరింగ్ అవుట్‌సోర్సింగ్ కార్మికుల ఆందోళనలు ఊపందుకున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఎలాంటి న్యాయం జరగలేదని నిరాహారదీక్షలు చేపట్టారు. అన్ని మున్సిపాలిటీల అధికారులు, స్థానిక శాసనసభ్యులకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ నెల 20 నుంచి మునిసిపల్ కార్యాలయాల వద్ద రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారు. దీంతో ఇంజనీరింగ్ విభాగంలోని ఎలక్ట్రికల్, ప్లంబింగ్, వాటర్ వర్క్స్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, పార్కు మజ్దూర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, సెక్యూరిటీ, అటెండర్స్ సేవలు నిలిచిపోయాయి. 2023 డిసెంబర్ నెలలో జరిగిన 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని కోరుతున్నారు. ఎక్స్‌గ్రేషియా ఏడు లక్షలకు పెంపు, రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.75,000, దహన సంస్కారాల ఖర్చులు 20,000, రిటైర్‌మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచడం వంటి అంశాలు పెండింగ్ లోనే ఉన్నాయని, వాటిని తక్షణమే అమలు చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు కోరుతున్నారు.

సమ్మె ఆపేదే లేదు

తమ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె ఆపేదే లేదంటూ ఇంజనీరింగ్ అవుట్‌సోర్సింగ్ కార్మికులు ఉద్యమిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ మునిసిప ల్ ఇంజనీరింగ్ విభాగపు కార్మికసంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ తాడేపల్లిగూడెం మునిసిపల్ ఇంజనీరింగ్ అవుట్‌సోర్సింగ్ కార్మికులు గత మూడు రోజులుగా సమ్మెబాట పట్టారు. ఉదయంనుంచి సాయంత్రం వరకు రిలే దీక్షలు జరుగుతున్నాయి.

సమ్మె నోటీస్‌తో ఉద్యమ బాట

ఈ నెల 9 వ తేదీ విజయవాడ సమీపంలోని వడ్డేశ్వరంలో కమీషనర్ అండ్ డైరక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేటేషన్ డైరక్టర్‌కు జేఏసీ తరుపున సమ్మె నోటీస్ ఇచ్చారు. 10వ తేదీ నుంచి పట్టణ పరిధిలోని మునిసిపల్ కార్యాలయం వద్ద నిరసనలు తెలిపారు. నల్లబ్యాడ్జీలు, కళ్ళకు గంతలు, మోకాళ్లపై నిలబడటం, ఒంటికాలిపై నిలబడటం ఇలా పలు రకాలుగా నిరసనలు తెలిపారు. ఈ నెల 16వ తేదీన విజయవాడలో మహాధర్నాకు హాజరైయారు. 22వ తేదీ ఆదివారం అర్ధరాత్రి 12 గంటల నుంచి విధులు బహిష్కరించి సమ్మెలోకి వచ్చారు. సోమవారం నుంచి రిలే దీక్షలు మునిసిపల్ కార్యాలయం వద్ద ప్రారంభించారు.

ఏఏ విభాగాలు సమ్మెలో ఉన్నాయి

ఇంజనీరింగ్ విభాగంలోని హెడ్ వాటర్‌వర్క్స్, అవుట్ డోర్ వాటర్ సప్లై స్టాఫ్, ఆఫీస్ ఎలక్ట్రీషియన్లు, కంప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్స్, ఆఫీస్ స్టాఫ్, సెక్యూరిటీ గార్డులు ఈ సమ్మెలో పాల్గొంటున్నారు.

నిలిచిపోయిన సేవలు

తాడేపల్లిగూడెం ఇంజనీరింగ్ సెక్షన్‌లో 60 మంది ఉన్నారు. జిల్లాలో 310 కార్మికులు ఉన్నారు. హెడ్ వాటర్‌వర్క్స్ వద్ద తాగు నీటికి సంబంధించి క్లోరినేషన్, ఆలం కలపడం, కాపర్‌సల్ఫేట్ కలపడం, ఫిల్టర్‌బెడ్స్ బ్లీచింగ్‌తో క్లీనింగ్ సిబ్బంది లేకపోవడం వల్ల ఆయా పనులు నిలిచిపోయాయి. ప్రధాన పైపులైన్‌లు, అంతర్గత పైపులైన్‌లలో లేకేజీలు అరికట్టే వారు సైతం సమ్మెలో ఉండగా, వారి కొరత స్పష్టంగా కానవస్తుంది. స్ట్రీట్ లైటింగ్‌లో కార్మికులు, సెక్యూర్టీగార్డులు విధులకు హాజరు కాకపోవడం, ప్రధానంగా కంప్యూటర్ ఆపరేటర్లు సమ్మెలో ఉండటంతో అడ్మినిస్ట్రేషన్‌కు ఇబ్బందులు ఏర్పాడ్డాయి.

కార్మికుల ప్రధాన డిమాండ్లు

- టెక్నికల్ రూ.29,200, నాన్ టెక్నికల్ రూ.24,500 జీతం అమలుచేయాలి.
- షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలి
- రిటైర్‌మెంట్, చనిపోయినా, అనారోగ్యం పాలైన వారి స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలి
- ఆప్కాస్ రద్దు చేస్తే ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలి
- సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ అమలు చేయాలి
- చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలి .
- ఇతర ఉద్యోగుల మాదిరిగా గ్రాట్యుటీతో పాటు కనీస పింఛన్ రూ.10 వేలు ఇవ్వాలి.
- విధి నిర్వహణలో చనిపోయిన కార్మికులకు రూ.10 లక్షలు, అంగవైకల్యం పొందిన వారికి రూ.5 లక్షలు ఇస్తూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలి.

ఉద్యోగ భద్రత కల్పించాలి



పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగకపోవడంతో చాలా కష్టంగా ఉంది. కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. విధుల్లోకి వచ్చినప్పటి నుంచి ఒళ్లు దాచుకోకుండా పనిచేస్తున్న తమకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలి.

– అవిడి కుమార్, అవుట్ డోర్ పైపులైన్ ఫిట్టర్

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు



ఇంజినీరింగ్ సెక్షన్‌లో 15 ఏళ్లుగా పనిచేస్తున్నాను. ఉద్యోగం పర్మినెంట్ అవుతుంది కథా అనే ఆశతో చాలీచాలని జీతంతో నెట్టుకొస్తున్నాను. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న అంశాన్ని కూడా పట్టించుకోవడంలేదు. మా సమస్యలు ప్రభుత్వం పట్టిచుకోవడంలేదనే ఉద్దేశ్యంతో తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెకు దిగాల్సివచ్చింది.

– మర్రిపూడి సతీష్ కుమార్, వాటర్ వర్క్స్ ఫిట్టర్

ఏపీ నిట్‌లో సంవిధాన్ హత్యా దివస్



మాట్లాడుతున్న ఎస్.వి.రమణారావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.వి.రమణారావు పేర్కొన్నారు. భారత ప్రభుత్వ ఆధీనంలోని విద్యా, సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆదేశాలు మేరకు ఏపీ నిట్‌లో సంవిధాన్ హత్యా దివాస్ (రాజ్యాంగ హత్యా దినం) బుధవారం జరిగింది. రమణారావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలని తెలిపారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావంతో ముందుకు సాగాలని, లక్ష్యాలను సాధించడంతో పాటు దేశాన్ని ప్రగతి పథంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. ఇండియా ధి మదర్ ఆఫ్ డెమెక్రసీ లఘు చిత్రాన్ని తిలకించి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్ ప్రొఫెసర్ డాక్టర్ జి.రవి కిరణ్ శాస్త్రి, డాక్టర్ ఎస్.జయరామ్, అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వరరెడ్డి, విభాగాధిపతులు అచార్యులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలకు విద్యా సామగ్రి అందజేత

పాలకొల్లు సెంట్రల్: పట్టణ పరిదిలో బీఆర్ఎంవీ ఉన్నత పాఠశాల క్లస్టర్ పరిధిలోని పది ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు. బుధవారం బీఆర్ఎంవీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝూన్సీ లక్ష్మీభాయి సౌజన్యంతో విద్యార్థులకు పెన్సిళ్లు, పెన్నులు, స్కేళ్లు, చాక్‌మార్, ఎరేజర్లు అందజేశారు. విద్యా సామగ్రిని ఆయా పాఠశాలల అధ్యాపకులు అందుకున్నారు. క్లస్టర్ సెక్రటరీ రాయపూడి భవానీ ప్రసాద్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.